## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆసిఫాబాద్ టౌన్, మే 31 : ఆసిఫాబాద్ మండలంలోని బురుగూడ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలాటిగూడ గ్రామానికి చెందిన జిమ్నాజీ(45) మృతి చెందగా, కూతరు, అల్లుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిమ్నాజీ, తన కూతురు వెన్నెల, అల్లుడు సోనూ శుక్రవారం రాత్రి ఆసిఫాబాద్ నుంచి చిలాటిగూడకు బైక్‌పై వెళ్తున్నారు. బురుగుడ సమీపంలోని యూ టర్న్ వద్ద మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీ కొట్టింది. దీంతో జిమ్నాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు, అల్లుడికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్ ద్వారా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## ఐదుగురి రిమాండ్

కాగజ్‌నగర్, మే 31 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిని ఆదిలాబాద్ జైలులో రిమాండ్ చేసినట్లు కాగజ్‌నగర్ పట్టణ ఎస్ఐ సుధాకర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌లో అక్రమంగా పశువులు తరలిస్తుండగా, మూడు ఎడ్లను పట్టుకొని కోసిని గ్రామంలో గల గోశాలకు తరలించారు. ఈ కేసు విషయంలో మూడు ఎడ్లను విడుదల చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గత 10వ తేదీన ఆసిఫాబాద్ పట్టణ ఎస్ఐ ఆకుల ప్రశాంత్, తమ సిబ్బందితో కలిసి సంబంధిత ఆర్డర్ కాపీతో కోసిన గ్రామానికి వచ్చారు. గోశాల ఇన్‌చార్జి ఉమాకాంత్‌తో మాట్లాడి, మూడు ఎడ్లకు మెయింటనెన్స్ చార్జీ చెల్లించి, తిరిగి ఆసిఫాబాద్ బయల్దేరు. దారి మధ్యలో పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఎదుట బీటీ రోడ్డుపై శివ గౌడ్, విజయ్ కుమార్, అరుణ్ లోయ, సాయి పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై అదే రోజున ఆసిఫాబాద్ ఎస్ఐ ఆశీర్వాద కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తగు చర్యల తీసుకోవాలని దరఖాస్తు చేసేందుకు రాగా, అక్కడా సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ బీభత్సం సృష్టించారు. ఈ విషయంలో 14 మందిపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత శివ గౌడ్, విజయ్ కుమార్, అరుణ్ లోయ, శమీర్ గుప్తా, సాయి గౌడ్‌ను శనివారం అరెస్ట్ చేశారు. సిర్పూర్ కోర్టులో హాజరుపర్చగా, సదరు వ్యక్తులను రిమాండ్ చేసి, ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని గొడవ

హాజీపూర్, మే 31 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ తప్పుడు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేశాడని ఏసీసీకి చెందిన చంద్రమౌళి రెడ్డి శనివారం కారాయలయంలో గడవకు దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఏసీసీకి చెందిన చంద్రమౌళి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 283లో నంద్యాల జగన్నాథమ్మ పేరుతో 156 గజాల స్థలం ఉందని, జీవో 59 ప్రకారం తన అన్నయ్య అయిన నంద్యాల శ్రీనివాస్ రెడ్డి పేరున చేశామని తెలిపారు. తమ తల్లి చనిపోవడంతో ఆ స్థలం నలుగురు అన్నదమ్ములకు చెందాల్సి ఉందని, ఇప్పటికే ఆ స్థలం విషయంలో తమ అన్నదమ్ములకు గొడవ నడుస్తున్నదని పేర్కొన్నారు. అన్నయ్య ఒక్కడే అతడి కొడుకు లు సాయి సిద్ధార్థ రెడ్డి, నవీన్ రెడ్డిపై ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించాడని, నలుగురికి చెందాల్సిన ఆస్థి ఒక్కరికి ఎలా చేస్తారని డాకుయమెంట్ రైటర్‌తో గొడవపడుతుండగా, వీడియో తీసి వైరల్ చేస్తున్నారని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై సబ్-రిజిస్ట్రార్ ప్రియాంక రెడ్డిని వివరణ కోరగా, డాక్యుమెంట్ నుంచి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు.

## టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట

దండేపల్లి, మే 31 : టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని గూడెం, నంబాల గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు మాట్లాడారు. తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కిరణ్‌కుమార్, చంద్రమౌళి, నర్సయ్య ఉన్నారు.

లక్షెట్టిపేట, మే 31 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్య పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. జిల్లా కార్యదర్సులు కే చంద్రమౌళి, జీ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నస్పూర్, మే 31 : 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో (1 నుంచి 5 తరగతులు) ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్ 91 సీట్లు), 5 వతరగతికి (రెసిడెన్షియల్ 92 సీట్లు) కేటాయించినట్లు వివరించారు. షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థులు జూన్ 3 నుంచి 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలలోపు ఉండాలని, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## మంత్రిని కలిసిన నాయకులు

హాజీపూర్, మే 31 : మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కను కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పంచాయతీ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు. మండల పంచాయతీ అధికారులు తమ సమస్యలను వివరించారు. వారిలో డీపీవోతో పాటు బెల్లంపల్లి ఇన్‌చార్జి డీఎల్పీవో సప్దర్ అలీ, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపూరావ్, అజ్మత్ అలీ, శ్రీనివాస్ ఉన్నారు. అలాగే టీఎన్జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీతో పాటు, సీపీఎస్ రద్దు చేసి, వోపీఎస్‌ను కొనసాగించాలని వివరించారు.

## రిలే దీక్షకు మద్దతు

ఆసిఫాబాద్ టౌన్, మే 31 : ఆదివాసులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట మూడు రోజులుగా చేపడుతున్న రిలే నిరహార దీక్షకు శనివారం వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు మద్దతు తెలిపారు. అటవీ హక్కు పత్రాలు ఉన్నవారిని భూ పోర్టల్‌లో నమోదు చేసి, బ్యాంక్ రుణాలు ఇవ్వాలన్నారు. గిరి వికాస్ పథకం కింద బోర్లు వేయించాలని, సాగు చేసుకుంటున్న భూముల్లో కందకాల తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు సిడాం అర్జు పటేల్, నాయకులు ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్ దీపక్, వినోద్, నవీన్, సంతోష్, రవి, జైరాం పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి, మే 31 : గ్రామాల్లో అపరిశుభ్రత ఏర్పడకుండా ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ అన్నారు. కెరమెరి మండలం కొఠారి, రింగన్‌ఘాట్, సాకడ, సాంగ్వీ సుర్దాపూర్, ఖైరి గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో అమ్జద్ పాషాతో కలిసి పర్యటించారు. పారిశుధ్యం, నీటి సరఫరా, నర్సరీలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని, నీటి సరఫరా ఓఆర్ఎస్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

- లక్షెట్టిపేట, చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జీలు సాయికిరణ్, రవి
- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



లక్షెట్టిపేట : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సాయి కిరణ్



చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి రవిని సన్మానిస్తున్న సీఐ, కార్యదర్శి

లక్షెట్టిపేట, మే 31 : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని జీవితాలను నాశనం చేసుకోవద్దని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం లక్షెట్టిపేట కోర్టు ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు జీవితాలను నాశనం చేస్తుందన్నారు. వ్యసనానికి గురైతే, క్యాన్సర్‌కు దారితీస్తుందని, తద్వారా ఆర్థికంగా, శారీరకంగా నష్టపోతామని వివరించారు. అనంతరం మోదేల గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని, క్షణికావేశంతో చేసిన తప్పులను సరిదిద్దుకొని కోర్టు కేసుల నుంచి విముక్తి పొందాలన్నారు. జూన్ 14న ఏర్పాటు చేయనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, జనరల్ సెక్రటరీ ప్రదీప్ కుమార్, సత్యం, స్థానిక ఎస్ఐ సురేశ్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వరరావు, అక్కల శ్రీధర్, రవీందర్, పద్మ, రెడ్డిమల్ల ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, మే 31 : ధూమపానం ఆరోగ్యానానికి మహాశాపమని చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. కోటపల్లి మండలం కొల్లూరు గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పొగాకు సేవించడం వల్ల తీవ్ర అనారోగ్యపాలవుతూ రోగాలను కొనితెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ధూమపానం సరదాగా ప్రారంభమై, వ్యసనంగా మారి ప్రాణాలను హరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎంఈవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెన్నపురెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జంగ రమేశ్ రెడ్డి, న్యాయవాది కొప్పుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## 44 కిలోల పత్తి విత్తనాల పట్టివేత

భీమిని, మే 31 : భీమిని మండలం రాంపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం వాహనాల తనిఖీలో 44 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. భీమిన పోలీస్‌స్టేషన్‌లో వనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తక్కల్లపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబ్బారావు నకిలీ విత్తనాల దందా నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ అయిన సూర్యకాంత్‌తో పరిచయం పెంచుకున్నాడు. నకిలీ విత్తనాలను ఆటోలు తరలించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సూర్యకాంత్ 44 కిలోలు తీసుకొని, రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన రవికి 10 కిలోలు, వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు 18 కిలోలు అందించి, రూ.50 వేలు తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్.. వాహనాల తనిఖీలో భాగంగా ఆటోను పరిశీలించారు. నకిలీ విత్తనాలు ఉండడంతో డ్రైవర్ సూర్యకాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసులు ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి యమున దుర్గకు తెలిపారు. దీంతో ఆమె వచ్చి, పంచనామా నిర్వహించారు. తెలిపారు. ఆటోలో ఉన్న 16 కిలోల విత్తనాలతో పాటు, విక్రయించిన 28 కిలోలు మొత్తం 44 కిలోల నకిలీ విత్తనాలు, ఆటోను, విత్తనాలు అమ్మగా వచ్చిన రూ.50 వేలను స్వాధీనం చేసుకున్నారు. విత్తన దందా చేస్తున్న ఉపాధ్యాయుడు సుబ్బారావు, ఆటో డ్రైవర్ సూర్యకాంత్, నంబాలకు చెందిన రవి, వెంకటాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి యమున దుర్గ, పోలీసులు రామాగౌడ్, వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీపీపీలో ఎడ్యుకేషన్ జీఎం పర్యటన

జైపూర్, మే 31 : జైపూర్‌లోని సింగరేణి విద్యుదుత్పత్తి కేంద్రంలో శనివారం సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) శ్రీనివాస్ పర్యటించారు. ఉద్యోగుల పిల్లల కోసం సీబీఎస్ఈ పాఠశాల ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, అధికారులు, నాయకులు సీఎండీకి విన్నవించారు. కాగా, పాఠశాల ఏర్పాటుకు యాజమాన్యం వచ్చింది. సీఎండీ ఆదేశాల మేరకు జీఎం పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## శ్రీరాంపూర్ గనుల్లో వందశాతం ఉత్పత్తి

సీసీసీ నస్పూర్, మే 31: శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ, ఓపెన్‌కాస్టు గనులు కలుపుకొని మే నెలలో వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. మే నెలలో ఏరియాలోని ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ గనులు 100 శాతం, శ్రీరాంపూర్ ఓసీపీలో 122 శాతం ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. 5,32,250 టన్నులకు గాను 5,32,267 టన్నుల ఉత్పత్తి వచ్చినట్లు వివరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏరియాలో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతి స్టేడియంలో ఫుడ్ స్టాల్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీఎండీ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి సింగరేణిలో వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియాలో 50 హెక్టార్లలో 1,52,000 మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇటీవలి కాలంలో ఏరియాలోని ఎస్సార్పీ-3 గనిలో అధికారులు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణ నేపథ్యంలో విచారణ జరుగుతుందన్నారు. అధికారులు అవినీతికి పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీజీఎం పర్సనల్ అరవింద రావు, ఫైనాన్స్ ఏజీఎం బీభత్స, డీవైపీఎం కాంతారావు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి ఏరియాలో 88 శాతం..**

రెబ్బెన, మే 31 : బెల్లంపల్లి ఏరియాలోని గనులు 88 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. 3.37 లక్షల టన్నులకు గాను, 2.95 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బేహరా, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిలో 65 శాతం..**

మందమర్రి, మే 31 : మందమర్రి ఏరియాలో 2,24,000 టన్నులకు గాను 65 శాతంతో 1,45,506 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం జీ దేవేందర్ పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్య సాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఏరియా ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, ఏరియా రక్షణాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, మే 31: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుట్టిన రోజు వేడుకలను శనివారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. దుర్గం చిన్నయ్య నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం చిన్నయ్యకు పుట్టిన రోజు శుభాకాంక్ష లు తెలిపారు. యూత్ పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వంద పడకల దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌తో కలిసి మాట్లాడారు. నియోజకవ ర్గ ప్రజల గుండెల్లో సుస్థిర స్థాన సంపాదించుకున్న చిన్నయ్య పుట్టిన రోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ని యోజకవర్గ అభివృద్ధికి దుర్గం చిన్నయ్య చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమాల్లో నాయకులు మద్దెల గోపీ, కాంపల్లి రాజం, గద్దల ధర్మేందర్, పం తంగి సంతోష్, గోమాస వినోద్, దాసరి సతీశ్, ఖలీమ్, మచ్చ రాజేశ్, కృష్ణరాజ్, చంద్రశేఖర్, మహేందర్, వెంకటేశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

హాజీపూర్, మే 31 : ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గుడిపేటలోని తెలంగాణ ప్రత్యేక పోలీస్ బెటాలియన్-13లో శనివారం ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములుతో కలిసి ఆయన హాజరై, పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వారిపై సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. కమాండెంట్ వెంకట్రాములు మాట్లాడుతూ ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ 20 ఏళ్లుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటి వరకు 28 మంది జీవితాలను కాపాడడం అభినందనీయమన్నారు. పోలీస్‌శాఖలో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో డీజీపీ ఆదేశాల మేరకు ఆత్మహత్యల నివారణ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త స్వామి, డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఆరోగ్యమిత్ర ప్రతినిధులు సహజ, రుషికేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

మందమర్రి, మే 31 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని మందమర్రి ఏరియాలో ఉత్తమ అధికారి, ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ అధికారిగా ఏరియా అడిషనల్ జనరల్ మేనేజర్(ఈఅండ్ఎం) వై వెంకటరమణ.., ఏరియాలోని కేకే-5 గనిలో కోల్ కట్టర్‌గా పని చేస్తున్న టీ సునీల్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉత్తమ అధికారిని కొత్తగూడెంలో నిర్వహించే సెంట్రల్ ఫంక్షన్‌లో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఉత్తమ ఉద్యోగిని స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో ఏరియా జీఎం జీ దేవేందర్ సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

**శ్రీరాంపూర్ ఏరియా నుంచి..**

సీసీసీ నస్పూర్, మే 31 : శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఇద్దరు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. ఆర్కే-6 గనిలో డీవైఎస్ఈగా పనిచేస్తున్న శ్యామ్‌కుమార్ అందే ఉత్తమ అధికారిగా, ఇదే గని సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ నజీరుద్దీన్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. శ్యామ్‌కుమార్ అందేను కొత్తగూడెంలో, మహ్మద్ నజీరుద్దీన్‌ను శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో సన్మానించనున్నారు. వీరిని జీఎం శ్రీనివాస్, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు అభినందించారు.

**బెల్లంపల్లి ఏరియా నుంచి..**

రెబ్బెన, మే 31 : బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ అధికారిగా జర్పుల శంకర్(ఖైర్‌గూడ ఓసీపీ మేనేజర్), ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా జూపాక రాజేశ్(ఈపీ ఆపరేటర్), కోల్ ఇండియాస్థాయిలో సిల్వర్ మోడల్ సాధించిన ఉద్యోగులకు ఏరియా స్థాయిలో సన్మానం కోసం ఓ మల్లేశ్(క్యారం), ఎం విజయశాంతి (అథ్లెటిక్స్), ఏరియాస్థాయిలో ఉత్తమ విద్యార్థులు దాసరి లోకేశ్, తుపాకుల రుద్రధ్రువన్ ఎంపికైనట్లు వివరించారు. కార్పొరేట్‌స్థాయిలో ఉత్తమ అధికారిని కొత్తగూడెంలో, ఏరియాస్థాయి ఉద్యోగులను గోలేటి క్రీడామైదానంలో సన్మానించి, జ్ఞాపిక అందించనున్నట్లు తెలిపారు.

## నేడు మున్నూరు కాపు సంఘం సమావేశం

రామకృష్ణాపూర్, మే 31 : క్యాతనపల్లి మున్సిపాలిటీలోని మున్నూరు కాపు సంఘ సమావేశం స్థానిక ఎస్ఆర్కే స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షుడు రామిడి కుమార్ శనివారం తెలిపారు. నూతన కమిటీని ఎన్నుకోవడంతో పాటు, సంఘం బలోపేతంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మున్నూరుకాపు సంఘం భవనం ఏర్పాటు విషయంలో అభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. కులబాంధవులు, పాత కమిటీ సభ్యులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సిర్పూర్(యూ), మే 31 : సిర్పూర్(యూ) తహసీల్దార్‌గా రాథోడ్ ప్రహ్లాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఉదయకుమార్ బదిలీపై జగిత్యాల జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ప్రహ్లాద్ బాధ్యతలు చేపట్టారు. కాగ రెవెన్యు సిబ్బంది. నాయకులు ఆయనను శాలువతో సన్మానించారు.

## విరమణ కార్మికుడికి సన్మానం

తాండూర్, మే 31 : తాండూర్ మండలం అబ్బాపూర్ ఓపెన్ కాస్ట్ సీనియర్ మైనింగ్ సర్దార్ పార్వతి సత్తయ్య విరమణ పొందగా, శనివారం అధికారులు, ఉద్యోగులు నాయకులు సన్మానించారు. ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు నాయకులు చంద్రకుమార్, శ్రీనివాస్, రవిశంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్, మే 31 : పెన్షనర్ల కోసం బ్యాంకులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శనివారం ఎస్‌బీఐ బ్యాంక్ కాగజ్‌నగర్ బ్రాంచ్ మేనేజన్ సతీశ్‌కు వినతి పత్రం అందించారు. స్పందించిన ఆయన, జూన్ 2 వరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు జయదేవ్, కార్యదర్శి శివప్రసాద్ నాయర్, ప్రతినిధులు నర్సయ్య, షేక్ మహబూబ్, సునీల్ కుమార్, సుభాష్, అన్వర్ అహ్మద్, కిషన్ కుమార్, విస్తారు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీపీకి అదనపు ఆదాయం

జైపూర్, మే 31: సింగరేణి సీఎండీ బలరాం దిశానిర్దేశంతో, డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు ప్రత్యేక చొరవతో సింగరేణి విద్యుదుత్పతిత కేంద్రం లభాల్లో దూసుకెళ్తున్నదని, బహిరంగ మార్కెట్‌లో కంపెనీకి అదనపు ఆదాయం సమాకూరుతున్నదని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీఎండీ బలరాం అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి, అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను రాష్ట్ర అవసరాల నిమిత్తం పోగా, మిగులు విద్యుత్‌ను జూన్ 1 నుంచి అమ్మకానికి ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్) సంస్థతో ఒప్పందం జరిగినట్లు వివరించారు. సహకరించిన తెలంగాణ ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్, డిస్కంలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజీఎం ఈఅండ్ం మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే-6 గని మేనేజర్ విమరణ

సీసీసీ నస్పూర్, మే 31 : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గని మేనేజర్ ఈర్ల తిరుపతి విరమణ పొందగా, గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. అలాగే ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా, ముస్కె సమ్మయ్య, సంఘం సదానందం, టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, గని అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు సత్కరించారు. రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, సంక్షేమాధికారి సురేందర్, ఏఐటీయూసీ నాయకులు గొర్రె నర్సయ్య, కారుకూరి నగేశ్, చిలుక రాంచందర్, టీబీజీకేఎస్ నాయకులు ముస్త్యాల రమేశ్, గొర్ల సంతోష్, వెంగల కుమారస్వామి పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో విరమణ పొందిన జనరల్ మజ్దూర్ కార్మికులు రాంచందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ట్రిప్‌మన్ కేతిరెడ్డి రంగారెడ్డిని పీవో శ్రీనివాస్, తోటి ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులు మోతె లచ్చన్న, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రమేశ్, పిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్ సన్మానించారు.

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్, మే 31 : తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం ఫ్యాక్స్ ద్వారా తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి శనివారం లేఖ పంపినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి, మలి దశ ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లి, అనేక రకాలుగా నష్టపోయిన ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, వారి పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులను సన్మానించాలని పేర్కొన్నారు.

## పీఎంఎస్‌జీఎంబీవై పై శిక్షణ

సీసీసీ నస్పూర్, మే 31 : శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రభుత్వ ఐటీఐలో పీఎంఎస్‌జీఎంబీవై(ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముట్ బిజిలి యోజన)పై ఉచితంగా వారం రోజుల షార్ట్‌టర్మ్ కోర్సుపై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ వద్దకు వచ్చి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తీసుకున్న వారికి ఓజేటీ (ఆన్ జాబ్ ట్రైనింగ్) పూర్తి చేయించి, స్కిల్ డెవలప్‌మెంట్ కింద వారికి సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణకు ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసినవారు, పూర్తి చేయబోతున్నవారు అర్హులని వివరించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ

కౌటాల, మే 31 : కౌటాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలను ఎంఈవో గావుడే హన్మంతు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం రోజే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారివారి పాఠశాలల వివరాలతో పాఠ్య పుస్తకాలు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏకరూప దుసులు అందించారు. ఆయన వెంట ఏపీఎం ముక్తేశ్వర్, హెచ్ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

## ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

హాజీపూర్, మే 31 : విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని గుడిపేటలోని ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి వెంకట్రాములు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ శ్రీరంగం దంపతులను శనివారం ఘనంగా సన్మానించి, బహుమతి అందజేశారు. కమాండెంట్ మాట్లాడుతూ.. ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. విరమణ చేసిన శ్రీరంగం శేషజీవితం కుటుంబంతో ఆనందంగా గడుపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ మునీర్‌కు నివాళి

మందమర్రి, మే 31 : తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ మునీర్‌కు బొగ్గు గని కార్మికులు, పలు సంఘాల నాయకులు నివాళులర్పించారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులతో పాటు, సంఘాల నాయకులు మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన వ్యక్తి మునీర్ అని కొనియాడారు. యూనియన్ నాయకులు భీమనాథుని సుదర్శన్, ఓ రాజశేఖర్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, ఆర్ నరేందర్, భీమర సదయ్య, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 8న జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

నస్పూర్,మే 31 : మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముకేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్ 11,13 విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, అండర్ 15,17,19 మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్, మాస్టర్స్‌లో 35 ప్లస్ నుంచి 75 ప్లస్ వరకు ఎంపిక జరుగుతుందని తెలిపారు. 8న ఉదయం 9 గంటలకు మంచిర్యాలలోని హైటెక్ సిటీలో గల మంచిర్యాల క్లబ్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 98495 05695 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## యోగా జీవితంలో ఓ భాగం

తాండూర్, మే 31 : యోగా సాధన ప్రతీ వ్యక్తి జీవితంలో ఒక భాగం కావాలని తాండూర్ పీహెచ్‌సీ, ఆయుష్ డాక్టర్లు ఝాన్సీ, శృతి సూచించారు. ఇంటర్‌నేషనల్ యోగా డే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తాండూర్ పీహెచ్‌సీలో యోగా తరగతులు నిర్వహించారు. పని ఒత్తిడి వల్ల కలిగే మానసిక ఒత్తిడి, ఎగ్జైటింగ్, నిద్రలేమి వంటి సమస్యల వల్ల పనసు లగ్నం చేయలేక పోతామని పేర్కొన్నారు. యోగా ద్వారా సమస్య తగ్గించవచ్చని వివరించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు, పీహెచ్‌సీ సిబ్బంది, యోగా ఇన్‌స్ట్రక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలి

రెబ్బెన, మే 31 : ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నిలకడగా ఉండాలన్నా, విద్యా ప్రమాణాలు పెరుగాలన్నా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల నరసింహాచారి, జాడి జ్ఞానేశ్వర్, బత్తుల సదానందం, రేగళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి దుక్కులతో నాణ్యమైన దిగుబడి

మందమర్రి రూరల్, మే 31 : రైతులు తమ పంట పొలాల్లో వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమి గుల్లబారి నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి రైతులకు సూచించారు. మండలంలోని పొన్నారం గ్రామంలో శనివారం రైతులకు వేసవి దుక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో కనకరాజు, పంచాయతీ కార్యదర్శి హరీశ్, నాయకులు పెంచాల రాజలింగు, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677